ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.9 । కనిష్ఠం 29.8



ఎస్సారెస్పీ..కడెం పూడికలకు మోక్షం



- ఖరారైన కడెం టెండర్ ప్రక్రియ
- పనులు దక్కించుకున్న రాజస్థాన్ కంపెనీ
- 20 ఏళ్ల పాటు సిల్ట్ తొలగింపునకు అగ్రిమెంట్
- ఎస్సారెస్పీ పూడికతీత ప్రక్రియ వైపు అడుగులు
- పెరగనున్న ప్రాజెక్టుల నీటినిల్వ సామర్థ్యాలు

నిర్మల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కడెం ప్రాజెక్టు, ఎస్సారెస్పీ ప్రాజెక్టులకు ముప్పుగా మారుతున్న పూడికను తొలగించేందుకు ఎట్టకేలకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ప్రభుత్వం మొదట కడెం ప్రాజెక్టుతోపాటు కరీంనగర్ జిల్లాలోని మిడ్‌మానేరు, లోయర్ మానేరుడ్యామ్‌లలో ప్రయోగాత్మకంగా పూడికతీతను తొలగించేందుకు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టు తర్వాత ఎస్సారెస్పీ ప్రాజెక్టులోని పూడికనుకూడా తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాజెక్టు పరిధిలోని సరస్వతీ కాలువ జిల్లాకు వరప్రసాదినిగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. జిల్లాలోని సరస్వతీ కాలువ ద్వారా దాదాపు 30 వేల ఎకరాల పంట పొలాలకు సాగు నీరందుతోంది. దశల వారీగా ప్రాజెక్టులోని పూడికను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొదటిదశలో భాగంగా కడెం ప్రాజెక్టు పూడిక తొలగింపు కోసం నిర్వహించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తయింది. పూడిక తొలగింపు పనులతో పాటు ఆ పూడికను ప్రాసెసింగ్ చేసే పనులను రాజస్థాన్‌కు చెందిన ఈతర్ అనే కంపెనీ దక్కించుకుంది. సదరు కంపెనీ టెండర్ విధానంతో ఈ పనులను దక్కించుకుంది. ఈ కంపెనీ 20 సంవత్సరాల వరకు కడెం ప్రాజెక్టులోని పూడికను ఎప్పటికప్పుడు తీసి ఆ పూడికను ప్రాసెసింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం గాను ప్రాజెక్టు సమీప ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్‌ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రాసెసింగ్ యూనిట్ కోసం ఇప్పటికే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ స్థలాన్ని సైతం గుర్తించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో రెండు నుంచి మూడు టీఎంసీల లోతు వరకు పూడిక పేరుకుపోయినట్లు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 7.630గా అధికారులు నిర్ధారించినప్పటికీ ఏటేటా పెరిగిపోతున్న పూడిక కారణంగా ఈ ప్రాజెక్టు నీటిమట్టం దాదాపు సగానికి పైగా తగ్గిపోయిందని అంటున్నారు. ఈ లెక్కన ప్రాజెక్టు ప్రస్తుతం నాలుగు టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి మాత్రమే పరిమితమైందని అంటున్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్ ఎగువన దాదాపు 15 నుండి 18 కిలోమీటర్ల పొడవు వరకు పూడిక ఉన్నట్లు దీనిపై జరిపిన సర్వే లెక్కలు చెబుతున్నాయి. ప్రతీ ఏటా ఈ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ వరద ప్రవాహం కారణంగా ప్రాజెక్టులోకి పెద్ద ఎత్తున చెత్తా చెదారం, బురద, మట్టి లాంటివి వచ్చి చేరుతున్నాయి. దీంతో ఏటేటా పూడిక పెరిగిపోయింది. ప్రాజెక్టుల్లో పూడిక తొలగింపు సాధ్యం కాదని గతంలో ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూడిక సమస్యపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. దీనికి అనుగుణంగా నిపుణులతో చర్చించి పరిష్కార మార్గాన్ని అన్వేషించింది. ఇందులో భాగంగానే మూడు ప్రాజెక్టులను ప్రయోగాత్మకంగా ఎంపిక చేసింది ఈ ప్రాజెక్టుల్లో పూడికతీత చర్యలకు శ్రీకారం చుట్టింది.

20 ఏళ్ల అగ్రిమెంట్‌తో పనులు దక్కించుకున్న ఈతర్ కంపెనీ

జనవరిలోనే కడెం ప్రాజెక్టు పూడికతీత పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరిగింది. ఎట్టకేలకు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఈతర్ కంపెనీ పూడికతీత, ప్రాసెసింగ్ పనులను దక్కించుకుంది. అయితే ఈ కంపెనీ ప్రభుత్వానికి టన్ను పూడిక మట్టికి 407 రూపాయల ధరను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే 20 ఏళ్ల వరకు ఈ పనులను ఈతర్ కంపెనీ నిర్వహించనుంది.

ప్రాసెసింగ్ యూనిట్, స్టాక్ పాయింట్ కోసం స్థల సేకరణ పూర్తి

కడెం ప్రాజెక్టులోని పూడికతీత పనులను దక్కించుకున్న ఈతర్ కంపెనీ ఆధ్వర్యంలో సిల్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నారు. దీనికోసం ఇప్పటికే అధికారులు దాదాపు 80 ఎకరాల స్థలాన్ని సేకరించారు. మండలంలోని ఎర్వచింతల్, రేవోజీపేట, సోమవార్‌పేటలలో స్థలాన్ని సేకరించారు. కాగా ఇందులో నుంచి 10 ఎకరాలలో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాగా మిగిలిన మరో 70 ఎకరాలలో స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్ నుండి తీసే పూడికను ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్‌లో ఇసుకగా అలాగే మట్టిగా వేరు చేయనున్నారు. ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్ నుంచి ఇసుక, మట్టిని స్టాక్ పాయింట్‌కు తరలిస్తారు. ఇక్కడ మట్టి నుంచి వేరు చేసిన ఇసుకను సదరు ఏజెన్సీ యజమాని విక్రయించుకునేందుకు లైసెన్స్‌ను ప్రభుత్వం జారీ చేస్తుంది. అలాగే మట్టిని రైతులకు పంట పొలాల కోసం ఇవ్వనున్నారు. అలాగే ఇటుకల తయారీతో పాటు మట్టితో తయారయ్యే ఇతర అవసరాల కోసం విక్రయించనున్నారు.

కొత్త సాంకేతికతతో పూడికతీత పనులు...

కాగా కడెం ప్రాజెక్టులో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి, సరికొత్త యంత్ర పరికరాలతో పూడికతీత పనులను చేపట్టనున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుముఖం పట్టే నవంబరు, డిసెంబరు నెలల నుండే పూడికతీత పనులు చేపట్టనున్నారు. ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ ఆధునిక యంత్రాల ద్వారా వ్యాక్యూమ్ సిస్టంతో పూడికను వెలికి తీయనున్నారు. దాదాపు 7 నెలల పాటు నిరాటంకంగా వేసవికాలంలో పూడికతీత పనులు మరింత వేగంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు.

ఎస్సారెస్పీ పూడిక తొలగింపుతో సరస్వతికి మహర్దశ

కడెం ప్రాజెక్టు పూడిక తొలగింపు చర్యల అనంతరం ప్రభుత్వం శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోని పూడికను కూడా తొలగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటించడం పట్ల ఇక్కడి రైతాంగం హర్షం వ్యక్తం చేస్తుంది. ఎస్సారెస్పీలో పూడిక తొలగిస్తే జిల్లాలో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే సరస్వతి కాలువకు కూడా పూర్తిస్థాయి నీటి విడుదల జరగనుంది. దీంతో రబీ సీజన్ సరస్వతీ కాలువకు ప్రస్తుతం ఏర్పడుతున్న సాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయంటున్నారు.

చివరి ఆయకట్టుకు ఇక సాగునీరు

పూడికతీత పనుల కారణంగా రెండు మూడేళ్లలో కడెం ప్రాజెక్టు నుంచి చివరి ఆయకట్టు వరకు సాగునీ అందించే అవకాశం ఏర్పడనుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాజెక్టు కింద 38 వేల ఎకరాలకు సాగునీ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ రిజర్వాయర్‌లో పూడిక కారణంగా నీటిమట్టం తగ్గిపోవడం, అలాగే కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో సగం భూములకు కూడా సాగు నీరందడం లేదన్న ఆరోపణలున్నాయి. కడెం ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి ప్రతి ఏటా వర్షాకాలంలో పుష్కలంగా వరద నీరు వస్తున్నప్పటికీ రబీ పంటలకు మాత్రం పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేని పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. పూడికతీత పనులుమొదలు కాబోతున్నందున కడెంతో పాటు ఎస్సారెస్పీ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు కూడా పూర్తిస్థాయిలో సాగునీరు అందనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొడుకును చంపిన తండ్రి



బైనం అశోక్ మృతదేహం.. (ఫైల్‌ఫోటో)

లక్ష్మణచాంద, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మానవత్వం మంట గలిసింది. నిద్రిస్తున్న కన్న కొడుకునే తండ్రి గొడ్డలితో నరికి చంపిన సంఘటన జిల్లాలోనే శుక్రవారం కలకలం రేపింది. ఎస్సై రహమాన్ మాలిక్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బైనం ఎర్రన్న, ఇతని కుమారుడు బైనం అశోక్(32)ల మధ్య గత కొంత కాలంగా కుటుంబ కలహాలు చెలరేగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ అతితీవ్రంగా రాత్రి 12 గంటల వరకు కొనసాగింది. తండ్రి ఎర్రన్నను, భార్య లక్ష్మీని చంపుతానని అశోక్ బెదిరించాడు. ఆయన బెదిరింపుకు భయపడిన ఎర్రన్న ఇంటి నుంచి ఊరిలోకి వెళ్లిపోయాడు. అనంతరం శుక్రవారం ఉదయం 3 గంటలకు ఇంటికి వచ్చి గొడ్డలితో నిద్రిస్తున్న కొడుకును నరికి చంపి, ఆ గొడ్డలిని గ్రామ సమీపంలో పడేసి పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. హంతకుడి భార్య బైనం గంగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి భార్యలక్ష్మీతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే ఈ మధ్య కాలంలోనే ఇదే గ్రామంలో కన్న కొడుకును కన్న తల్లి, సొంత తమ్ముడిని తోడ పుట్టిన అన్న హత్య చేయటం పట్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మల్లాపూర్‌లో మానవత్వం మంటగలిసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చట్టాలు పకడ్బందీగా అమలు చేసి నేరస్తులను త్వరితగతిన శిక్షిస్తే తప్ప ఇలాంటి హత్యలు ఆగే అవకాశ లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

గోదావరి వద్ద ఇద్దరి ఆత్మహత్యా యత్నం

- ముందుగానే గమనించి రక్షించిన పోలీసులు



ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలిని..మహిళను కాపాడిన పోలీసు

బాసర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బాసర వద్ద శుక్రవారం ఇద్దరు మహిళలు వేర్వేరుగా ఆత్మహత్యయత్నం చేశారు. పోలీసులు ముందుగానే గమనించడంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు సాయమ్మ ,అదే మండలం ఫకీరాబాద్ కు చెందిన మరో మహిళలక్ష్మీ కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బాసరకు వచ్చారు. గోదావరి తీరంలో అనుమానస్పదంగా తిరుగుతుంటే అక్కడే విధుల్లో ఉన్న పోలీసు కానిస్టేబుల్ మోహన్ సింగ్ అనుమానం వచ్చి విచారించగా ఆత్మహత్య విషయం వెలుగులోకి వచ్చింది .వేర్వేరుగా జరిగిన ఈ రెండు ఘటనలు కానిస్టేబుల్ సమయస్ఫూర్తితో రెండు ప్రాణాలు రక్షించారు.ఇద్దరికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దస్తురాబాద్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దస్తురాబాద్, ఆకొండపేట, దేవునిగూడెం, భూత్కూర్, పెర్కపల్లె, మున్యాల్, ఎర్రగుంట, మున్యాల్ తండా గ్రామాల విద్యుత్ ఉందన్నారు.

జిల్లాలో వరుసగా మూడో రోజు రెడ్ అలర్ట్

- నాలుగు మండలాలలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతల నమోదు

ఖానాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరుసగా మూడో రోజు రెడ్ అలర్ట్ కొనసాగుతోంది. జిల్లాలో నాలుగు మండలాల్లో ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. జిల్లాలోని నర్సాపూర్(జి), మామడ, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఈ నాలుగు మండలాల్లో అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. జిల్లాలో అత్యధికంగా నర్సాపూర్(జి) మండలంలో 45.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా నిర్మల్ మండలంలో అత్యల్పంగా 42.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో నాలుగు మండలాల్లో రెడ్‌అలర్ట్, మిగతా మండలాల్లో ఆరెంజ్ అలర్ట్‌ను అధికారులు జారీ చేశారు. భారీగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా : డీసీసీ అధ్యక్షుడు



నూతన ఆలయ కమిటీ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

సారంగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అడెల్లి మహాపోచమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండలంలో గల అడెల్లి మహాపోచమ్మ ఆలయ నూతన పాలకవర్గ సభ్యులను ఆలయ ఇన్‌చార్జీ ఈవో రమేష్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ పాలకవర్గ చైర్మన్‌గా సింగం భోజాగౌడ్, ప్రమాణ స్వీకారం చేయగా పాలకవర్గ సభ్యులుగా రొడ్డ మారుతి, లక్ష్మీ, లస్మన్న, సాయన్న, భోజన్న, రత్నాకర్, వెంకట్ రమణరెడ్డి, ప్రసాద్, నర్సారెడ్డి, ప్రభాకర్‌గౌడ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బొల్లోజీ నర్సయ్య, సత్యపాల్‌రెడ్డి, కొట్టే శేఖర్, ముత్యంరెడ్డి, సతీష్, శ్రీకాంత్, గాజుల రవికుమార్‌లతో పాటు నాయకులు భక్తులు పాల్గొన్నారు.

ముగ్గురు మట్కా జూదరుల పట్టివేత

భైంసా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో శుక్రవారం ముగ్గురు మట్కా జూదరులను పట్టుకున్నట్లుగా టౌన్ సీఐ గోపినాథ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు పలు ప్రాంతాల్లో జరిగిన ఆకస్మిక దాడుల్లో మట్కా జూదరులు పట్టుబడినట్లుగా వివరించారు. ముగ్గురు మట్కా జూదరుల నుంచి రూ.1600 నగదుతో పాటు వారు వినియోగిస్తున్న సెల్ ఫోన్లు స్వాధీన పరుచుకున్నట్లుగా పేర్కొన్నారు. దాడుల సమాచారం మేరకు మరికొంత మట్కా జూదరులు పారిపోయినట్లుగా తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి పూర్తి వివరాల కోసం దర్యాప్తు ప్రారంభించినట్లుగా వెల్లడించారు.

మత్తుపదార్థాలతో తీవ్రనష్టం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలు సేవించడం వల్ల ఆరోగ్యంతో పాటు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండంపల్లిలో మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని కిరాణా, మెడికల్, టీ కొట్టుల్లో తనిఖీలు చేశారు. గుండంపల్లిలో కొంత మంది యువకులు గంజాయి సేవించడంతో పాటు ఇతరులకు అమ్ముతున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయి సేవించిన, అమ్మిన, కొన్న నేరమన్నారు. ఎవరైనా గంజాయి సేవించినట్లు తెలిస్తే కటకటాల వెనక్కి నెట్టడం ఖాయమన్నారు. ఈ తనిఖీల్లో దిలావర్‌పూర్ ఎస్సై సందీప్, పోలీసులు పాల్గొన్నారు.

విజయ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పట్టణం విజయ హైస్కూల్‌లో శనివారం ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. జనరల్ సెక్రటరీ భూమయ్య, కరస్పాండెంట్ నాగభూషణం, ఈసీ మెంబర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

భూ భారతి చట్టం.. రైతుల పాలిట వరం

- అవగాహన సదస్సులో కలెక్టర్ అభిలాష అభినవ్



బన్సపల్లిలో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

దిలావర్‌పూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం రైతుల పాలిట వరమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బన్సపల్లి రైతు వేదికలో భూ భారతి చట్టంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు ఎంతో కాలంగా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఇబ్బంది పడుతున్న వేళ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా భూమికి సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. రైతులు ఇకపై ఆందోళన చెందకుండా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. త్వరలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ఈ సదస్సులో రైతులు తమ సమస్యలను రాత పూర్వకంగా అధికారులకు ఇవ్వాలని సూచించారు. ప్రతి భూ సమస్యను పరిష్కరించేందుకు భూ భారతి చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో గ్రామాల్లో గ్రామ పాలనాధికారులను నియమించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తుందని ఈ నిర్ణయం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సాదా బైనామాలకు సంబంధించిన సమస్యలతో పాటు ఇతర ఏ సమస్యలున్న రైతులు చాలా సునాయాసంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌బాబు, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, మండల ప్రత్యేక అధికారి శంకర్, తహసీల్దార్ అహ్మద్‌ఖాన్, ఎంపీడీవో అరుణ రాణి, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో దివ్యరెడ్డి, ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, ఎంపీవో గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

భూములపై పూర్తి యాజమాన్య హక్కు చట్టాలు లభిస్తాయి

సారంగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టంతో రైతులకు పూర్తి యాజమాన్య హక్కు పట్టాలు లభిస్తాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల రైతువేదికలో రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ హక్కులను చట్ట బద్ధంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందన్నారు. భూ చట్టాల నిపుణులు, న్యాయ నిపుణులు , రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకొని ఇతర రాష్ట్రాల భూ చట్టాలను పరిశీలించిన తర్వాత సమగ్ర భూభారతి చట్టం అమలులో తహసీల్దార్ స్థాయిలో ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. గ్రామాల్లో గ్రామాలన అధికారులను నియమించడం ద్వారా రైతుల భూ సమస్యలను సత్వర పరిష్కారం లభిస్తుందని అన్నారు. గతంలో ధరని వ్యవస్థతో రైతులు ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ఈ భూభారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యలు పరిష్కారం లభిస్తుందని రైతులకు హామీ ఇచ్చారు. ఈ భూభారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ సైజాన్ అహ్మద్, నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దశరథ్ రాజేశ్వర్, ఓల త్రినారాయణరెడ్డిలతో పాటు రైతులు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

భూ సమస్యలన్నీ పరిష్కారమవుతాయి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ధరణి పోర్టల్ ద్వారా వచ్చి భూ సమస్యలన్ని భూ భారతి చట్టం లేదా పోర్టల్ ద్వారా పరిష్కారమవుతాయని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భూ భారతి చట్టంపై క్లుప్తంగా వివరించారు. ధరణి పోర్టల్ ద్వారా గ్రామస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల స్థాయికి, మండల స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు రాష్ట్రస్థాయికి వెళ్లాయన్నారు. తద్వార సామాన్య రైతులు, ప్రజలు అనే సమస్యలకు గురయ్యారని తెలిపారు. అంతేకాకుండా గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు లేని కారణంగా భూ సమస్యలు పరిష్కరించాలంటే మండల స్థాయి అధికారులకు తలనొప్పిగా మారిందని, తద్వార అధికారులు, ప్రజల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ సమస్యలను సులువుగా పరిష్కరించటం కోసం మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల చట్టాలను, టెక్నాలజీని స్టడీ చేసి భూ భారతి చట్టం రూపొందించిందన్నారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికి వెళ్లాల్సిన పని లేదని అధికారులే మీ వద్దకు వచ్చి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా ఎటువంటి సమస్యనైనా సులువుగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈటల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సారంగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మలేరియా నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య సిబ్బంది సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మలేరియాతో పాటు కీటక జనిత వ్యాధుల నివారణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. గతంలో దేశంలో మలేరియా అత్యధికముగా ఉండేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా చేయడం జరిగిందన్నారు. అత్యంత ప్రమాదకరమైన జ్వరం అని, దీని నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, నీటి నిల్వ లేకుండా చూస్తే మలేరియా కీటక జనిత వ్యాధుల నివారణ సాధ్యం అవుతుందన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, మాస్‌మీడియా అధికారి బారే రవీందర్, మెడికల్ ఆఫీసర్ అబ్దుల్ జవాద్, సూపర్‌వైజర్‌లు ఉష, శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన సార్వత్రిక పరీక్షలు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు శుక్రవారంతో ముగిసాయని జిల్లా విద్యాధికారి పి. రామారావు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రధాన పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరిగాయని, రేపు ఒకేషనల్ పరీక్ష మాత్రమే జరుగుతుందని ఆయన తెలిపారు.

జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్, డీవోలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాధికారి తనిఖీ చేశారు.

గడ్డెన్నవాగు ప్రాజెక్టులో

చనిపోయిన కోళ్ల పారవేత



ప్రధాన కాలువలో పారవేసిన చనిపోయిన కోళ్లు

భైంసా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు పరిధిలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు ప్రధాన కాలువలో గుర్తు తెలియని వ్యక్తులెవరో చనిపోయిన కోళ్లను పారవేశారు. శుక్రవారం ఉదయం వేళలో ప్రాజెక్టు రెగ్యులేటర్ మార్గంలోని ప్రధానకాలువలోని రెండు ప్రాంతాల్లో వందల సంఖ్యలో చనిపోయిన కోళ్లు కనిపించాయి. స్థానిక చికెన్ విక్రయదారులే చనిపోయిన కోళ్లను ప్రధానకాలువలో పారవేసారనే ఆరోపణలు వినవస్తున్నాయి. కోళ్లకు వ్యాధులు రావడంతో పాటు ఎండ వేడిమికి తాళలేక చనిపోయిన నేపథ్యంలో చికెన్ వ్యాపారులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయకట్టు రైతాంగం పేర్కొంటోంది. కాగా ప్రస్తుతం ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు సాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో చనిపోయిన కోళ్ల పారవేసిన స్థలంలోనే తేలియాడుతూ కనిపిస్తున్నాయి. ప్రాజెక్టు నిర్వాహణాధికారులు ప్రధాన కాలువలో చనిపోయిన కోళ్ల పారవేత జరుకుండా చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతోంది.

మొక్కజొన్న దగ్ధం

ముథోల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆష్ట గ్రామశివారులో శుక్రవారం పెట్టెపు రవీందర్‌రెడ్డికి చెందిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. బాధితుడి కథనం ప్రకారం.. తకున్న నాలుగు ఎకరాల మొక్కజొన్న పంటను కోసి కుప్పలుగా పెట్టి ఉంచాడు. అయితే శుక్రవారం సాయంత్రం గాలి వీయడంతో చేనులోని విద్యుత్ తీగలు ఒకదానికి ఒకటి తగిలి మంటలు పడి మొక్కజొన్న పూర్తిగా దగ్ధమైంది. దీని విలువ సుమారు రూ. 4 లక్షల వరకు ఆర్థిక నష్టం జరిగిందని తెలిపారు. దగ్ధమైన మొక్కజొన్న చేనును ఆర్ఐలు నారాయణ పటేల్, సర్పతిలు పరిశీలించి పంచనామా నిర్వహించారు.

ఒకరి బైండోవర్

నర్సాపూర్(జి), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శుక్రవారం శాంతి భద్రతలకు భంగం కలిగించిన ఒకరిని పోలీసులు బైండోవర్ చేశారు. అనంతపేట్ గ్రామానికి చెందిన కుంటాల సూర్యతేజను తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ శ్రీనివాస్ ముందర పోలీసులు బైండోవర్ చేశారు. మరొక్క మారు శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే లక్ష రూపాయల జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలిపారు.

మిషన్ భగీరథ నీళ్లు రాక ఇబ్బందులు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి మిషన్ భగీరథ నీళ్ల సక్రమంగా అందించకపోవడంతో గ్రామస్థులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండకాలంలో ఇతర కాలనీ నుంచి నీరు తీసుకురావాలంటే ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అధికారులకు చెబితే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భగీరథ నీళ్ల వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే మిషన్ భగీరథ ఆధ్వరయంలో గ్రామ ప్రజలకు ట్యాంకర్ ద్వారా నీళ్ల అందించాలని డిమాండ్ చేశారు.



చామన్‌పెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామన్‌పెల్లిలో నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, చింతల్‌చందా, మునిపెల్లిలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీంరెడ్డిలు ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారుల చేతిలో మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఈటల శ్రీనివాస్, తహసీల్దార్ జానకి, ఐకేపీ ఏపీఎం వాణిశ్రీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు గాండ్ల చిన్నయ్య, అడ్వాల రమేష్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నలు కొనుగోలు కేంద్రాలను రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మలక్‌చించోలి బీరవెల్లి జొన్నల కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన జొన్నలను దళారులకు అమ్మిమోసపోవద్దని అన్నారు. జొన్నల క్వింటాలు ధర రూ. 3371లను ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందని రైతులందరు ఈ కొనుగోలు కేంద్రాలలోనే జొన్నలను విక్రయించి లబ్ధి పొందాలన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ మాణిక్‌రెడ్డి, బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు కాల్వ నరేష్, నాయకులు రాంశంకర్‌రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్‌రావు, చెన్న రాజేశ్వర్, కరిపే విలాస్, వీరయ్య, తిరుమలచారి, చంద్రప్రకాష్‌గౌడ్, తస్వపాల్‌రెడ్డి, భూమారెడ్డి, రాంరెడ్డి, మధు, దయాకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డిలతో పాటు రైతులున్నారు.

రూ. 9.55లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

సారంగాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన తాటిపత్రి మనోహర్ అనే యువకుడు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న బీజేఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబానికి రూ. 9లక్షల 55వేల సీఎంఆర్ చెక్కును ఆర్థిక సహాయం కింద అందజేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం కింద అందజేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేయడంతో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న టీజీఈం జేఏసీ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లు, ఉద్యోగ, కార్మిక, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే నివాసంలో కలిసిన నాయకులు పీఆర్సీ డీఏలు, ఈహెచ్ఎస్, సీపీఎస్ రద్దు తదితర సమస్యలు, 57 డిమాండ్ల పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావుకు వేరువేరుగా వినతిపత్రం అందజేశారు. పీజీ రెడ్డి, వి. ప్రభాకర్, ఎంపీ లింగన్న, నరేంద్రబాబు, తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రియదర్శిని నగర్ వాసుల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే

నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శుక్రవారం ప్రియదర్శినగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు, మురికి కాలువల వ్యవస్థను ఆయన పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, సాధం అరవింద్, నవీన్, నరేందర్, ఒడిసెల అర్జున్, జట్టు దినేష్, తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

విధులను బహిష్కరించి

నిరసన తెలిపిన న్యాయవాదులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై అతి కిరాతకంగా దాడి చేసిన ఉగ్రవాదులపై అదే తీరులో కేంద్రం చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నగేష్ అన్నారు. ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి, కోర్టు నుంచి కలెక్టర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ చిత్రపటం నుంచి పాకిస్తాన్ రూపు రేఖలు లేకుండా చేయాలని అన్నారు. ఉగ్రవాదాన్ని రూపుమాపాలని కేంద్రాన్ని కోరారు.

ఉట్నూర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ

ఉట్నూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలో కాశ్మీర్‌లో ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయినా భరతమాత ముద్దు బిడ్డల ఆత్మకి శాంతి కలగాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు ప్రజా సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడినా ఉగ్రవాదులను కాల్చి చంపాలని అంబేద్కర్‌చౌక్ నుంచి బాబుజగ్జీవన్‌రామ్‌చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఈ సందర్భంగా మరణించిన హిందు సోదరులకు ఆ దేవుడు శాంతి ఇవ్వాలని టీజీటీటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గణేష్‌రాథోడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్‌చంద్రకాంత్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రవినాయేక్, రాష్ట్ర నాయకులు కపిల్, గజేందర్‌రాథోడ్, నాయకులు రమేష్, రాథోడ్ అశోక్, సోదర ఉపాధ్యాయ సంఘాల నాయకులు బండి విజయ్, శ్రీనివాస్, ఆడ నగేష్, శ్యామ్‌రావు, దళిత సంఘం నాయకులు కాంబ్లె ప్రజ్ఞశీల్, శ్రీనివాస్, రమేష్, బీఎడ్ కాలేజి ప్రిన్సిపల్ మేస్రం మనోహర్, ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జామా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో..

ఉట్నూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లోని పహల్గావ్ ఉగ్రవాదదాడులకు నిరసనగా భారతీయ అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఉట్నూర్ మండల కేంద్రంలోని జామ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం రాత్రి పాత బస్టాండ్ మజీద్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తూ హిందు ముస్లిం బాయ్ భాయ్ అంటూ నినాదాలుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఐఏఎస్ సాధించిన బంజారా ముద్దుబిడ్డకు ఘన స్వాగతం

ఉట్నూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారత ప్రభుత్వం విడుదల చేసిన యూపీఎస్సీలో 68వ ర్యాంకు సాధించిన బంజారా ముద్దుబిడ్డ సాయిచైతన్య జాదవ్‌కు ఉట్నూర్ ప్రజలు శుక్రవవారం ఘన స్వాగతం పలికారు.

పహల్గాం ఘటన నిరసిస్తూ ర్యాలీ

● ఉగ్రవాదుల దాడి ఘటన అత్యంత బాధాకరం : ర్యాలీలో పలువురు వక్తలు ● కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఖానాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఘటన అత్యంత బాధాకరమని ఖానాపూర్‌లో పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. పహల్గాం ఘటనను నిరసిస్తూ గురువారం రాత్రి ఖానాపూర్‌లో ముస్లింల ఆధ్వర్యంలో శాంతిర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ చౌక్ నుంచి తెలంగాణ చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి పహల్గాం మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు.

గుడ్ మార్నింగ్ మారథాన్ టీమ్ ఆధ్వర్యంలో 5కే రన్

గుడ్ మార్నింగ్ మారథాన్ టీమ్ ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం స్థానిక వైద్యులు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ మారథాన్ టీమ్ మండలంలో 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాలను చేతబూని తమ పరుగును కొనసాగించారు. అనంతరం వైద్యులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ... ఉగ్రవాద నిర్మూలనకు సైనికచర్య చేపట్టాలని డిమాండ్ చేశారు. దేశంలో ఉచిత పథకాలకు స్వస్తి పలికి భారత సైన్యాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పహల్గాం పర్యాటకులపై ఉగ్రమూకల దాడిని నిరసిస్తూ శుక్రవారం ఖానాపూర్ బార్ అసోసియేషన్ కోర్టు విధులను బహిష్కరించింది. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని న్యాయవాదులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందరభంగా బార్ అసోసియేషన్‌అధ్యక్షులు మంత్రి రాజం సురేష్, ఏజీపీ ఆసిఫ్ అలీ, ప్రధాన కార్యదర్శి రాజలింగంలు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఖాజా, బాశెట్టి శివ, జి. కిషోర్ కుమార్,కమలాకర్, సలీం ఖాన్, సిల్వేరి వేణు, రవి, ఖదీర్, రాసమల్ల అశోక్, ఎర్ర రవి, తదితరులున్నారు.

భైంసా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం లో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు చేపట్టిన దుశ్చర్యలను నిరసిస్తూ భైంసా బార్ అసోసియేషన్ శుక్రవారం నిరసన ప్రదర్శనలు చేపట్టింది. ఉదయం వేళలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.శంకర్ నేతృత్వంలో ఉగ్రదాడులను నిరసిస్తూ న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. అనంతరం కోర్టు నుంచి స్థానిక బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ పాశవిక విధానాలతో నరమేధానికి తెగబడ్డ ఉగ్రవాదులను కేంద్ర ప్రభుత్వం మట్టికరిపించాలన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహ తుదముట్టించి ప్రేరిత పాకిస్థాన్ తగు రీతిలో గుణపాఠం నేర్పాలన్నారు. ఉగ్రదాడిలోని మృతులకు నివాళులర్పించి వారి ఆత్మశాంతి కోసం రెండు నిముషాలు మౌనం పాటించారు. క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలని అకాంక్షించారు.



ఖానాపూర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఉగ్ర దాడిని ఖండించిన టీజీ అధికారుల సంఘం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాశ్మీర్ ప్రాంతంలోని పహల్గాం పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు కొనసాగించిన దాడిని తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీజీ రెడ్డి, ధాత్రిక రమేష్ ఖండించారు. శుక్రవారం వారు విడుదల చేసిన ప్రకటనలో దాడిలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మానవత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇలాంటి చరయలు పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉగ్రమూకలను మూలాల నుండి పెకిలించి వేయాలని డిమాండ్ చేశారు.



ఆయిల్ ఫామ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సు

ముథోల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం గ్రామంలో శుక్రవారం ప్రీ యూనిక్ ఇండియా ఆయిల్ ఫామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ పెట్టి రైతులకు, ఆయిల్ ఫామ్ నాటే రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ ఆడెపు శేఖర్ మాట్లాడుతూ... రైతులకు మంచి రోజులు వచ్చేశాయని అన్నారు. ఆయిల్ ఫామ్ ఒక టన్ను ధర రూ. 21,000 చేరుకుందని పేర్కొన్నారు. భైంసా డివిజన్ పరిధిలో నాటిన పంట ఈ సంవత్సరం దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని, అలాగే కొత్తగా నాటుకునే రైతులకు అవకాశం ఇంకా ఉందన్నారు. ఉద్యాన శాఖ, పరిశ్రమ శాఖ ద్వారా ఉన్న రాయితీలను వివరించారు. ఒక ఎకరానికి 50 మొక్కలు, మొక్కకు మొక్కకు మధ్య దూరం 9/9 మీటర్లు, రైతు 90 శాతం రాయితీపై మొక్కలు రైతు కట్టాల్సిందని ఒక ఎకరానికి రూ. 1,000లు మాత్రమే. నాటిన మొదటి సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వం రూ. 4,200 ఎకరానికి ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతోపాటు ఆయిల్ ఫామ్‌కి డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ, బీసీ రైతులకు 90 శాతం రాయితీ, ఓసీ రైతులకు 5 ఎకరాల లోపు ఉంటే 80 శాతం రాయితీ ఆపైన ఉంటే 80 శాతం రాయితీ అలాగే అందరికీ జీఎస్టీ వర్తిస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ పెట్టిన మొదటి సంవత్సరం నుంచి 30 నెలల వరకు వచ్చిన పూత గెలలను తొలగించాలని, మూడు సంవత్సరాలు పూర్తయిన తోటలో వచ్చే సంవత్సరం దిగుబడి వస్తాయి. ఆయిల్‌ఫామ్ పంటలు వచ్చే చీడ పీడలు, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ఏమైనా వివరాలకై మండల ఆయిల్ ఫామ్ క్లస్టర్ ఆఫీసర్ మొయిన్ మియ్యా సెల్ 91549 78400కు సంప్రదించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోరటలో భక్తి శ్రద్ధలతో నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



జైనథ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని కోరట గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో నల్లపోచమ్మ, పోతరాజుల విగ్రహాలను డప్పులు భజాల మధ్య ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు రాజుబాబు వేద మంత్రాల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాల మధ్య ఊరేగింపు పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు పాడిపంటలతో చల్లంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా నల్లపోచమ్మ తల్లికి నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరట గ్రామ మాజీ సర్పంచ్‌లు బొల్లు రాదా అడెల్లు, మహేష్, గ్రామ పెద్దలు బొల్లుసాయి, వెంకటేశ్, గణేష్, గోష్కుల సాయి, సతీష్, రామ కృష్ణలతో పాటు గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాను మలేరియా రహితంగా మార్చటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్యాలయంలో మలేరియా నివారణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది కేవలం రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయని, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఒక్క కేసు నమోదు కాలేదని దీనికి కారణం ముందు జాగ్రత్తలు తీసుకోవడమే అన్నారు. ఏల్లా మలేరియా అధికారి శ్రీధర్, మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పదిమంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పది మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి పేకాట ముక్కలు, రూ.79, 500 నగదు, 10 మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.చంద్రశేఖర్ వచ్చిన విశ్వసనీయ సమాచార మేరకు ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుపెల్లి ఏరియాలో పేకాట ఆడుతుండగా సంఘటన స్థలంలో మహేందర్, రాజేష్, అనిల్, సందీప్, శంకర్, వినోద్ రెడ్డి, రవీందర్, రమేష్, లక్ష్మన్న, జితేందర్లను పట్టుబడ్డారని తెలిపారు. వారి వద్ద నుంచి పది మొబైల్ ఫోన్‌లు, పేకాట ముక్కలు, రూ.79, 500 నగదు స్వాధీనం వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపలనే జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ భవనాలు మంజూరు చేయాలి

నార్నూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గిరిజన ప్రాంత విద్యార్థులుకు మెరుగైన విద్య అందించేలా మండల కేంద్రంలో పలు అంగన్‌వాడీ భవనాలు ప్రభుత్వ డిగ్రీ, ఉర్దూ మీడియం డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని భూ భారతి అవగాహన సదస్సు కార్యక్రమానికి వచ్చిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు మండల యువజన ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్ కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సంబంధిత అంశాలను పరిశీలించి మంజూరు చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లుగా షేక్ మొహమ్మద్ తెలిపారు. వారి వెంట నాయకులు ఆసిఫాబాద్ నియోజకవర్గం యువజన ఉపాధ్యక్షుడు షేక్ నసీర్, దస్తగిర్, షేక్ సత్తార్ ఉన్నారు.

సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు ఆధ్వర్యంలో జోనల్ ఆఫీస్ హైదరాబాద్ ఎం.వి. రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ప్రచార రథాన్ని గ్రామాల్లోకి అవగాహన కల్పించారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు బ్యాంకు పరిధిలోని చర్లపల్లి, ఝరి, తలమడుగు గ్రామాలలో ప్రచారరథంతో అవగాహన సదస్సును నిర్వహించారు. డిజిటల్ సేవలపై సైబర్ మోసాల పట్ల సామాజిక భద్రత పథకాల గురించి కళాజాత ద్వారా మాటల ద్వారా పాటల ద్వారా మ్యాజిక్ షో ద్వారా అలాగే ప్రచార రథాన్ని గ్రామాల్లో ఊరు ఊరు వీధి వీధి వాడవాడలా తిప్పుతూ కార్యక్రమాన్ని తలమడుగు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రబ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రచార రథం కళాజాత బృందం సభ్యులు ఎడవల్లి అంజనేయులు, ఎడవల్లి చిరంజీవి, మిరియాల విజయ్, బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, ఫీల్డ్‌ఆఫీసర్ బ్యాంక్ స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తను

ఆసుపత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలం దంతనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సనావుల్లాఖాన్ హైదరాబాద్‌లోని రెనోవా సెంచరీ ఆసుపత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసుకొని చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి చేరుకుని సనావుల్లాఖాన్‌ను పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఎమ్మెల్యే తనవంతుగా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.

అంగన్‌వాడీకేంద్రంలో ఘనంగా వార్షికోత్సవం

జైనథ్; ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని కూర అంగన్‌వాడీకేంద్రం -1లో శుక్రవారం ఘనంగా వార్షికోత్సవ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలచే ఆట, పాటలు నృత్యాలు చేయించారు. అన్న ప్రసన్న శ్రీమంతాలు నిర్వహించారు. రెండున్నర ఏండ్లు నిండిన బాల బాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్ నర్సమ్మ సూచించారు. ఈ కార్యకరమంలో గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు

భైంసాలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై పోలీసుల కొరడా

● వ్యాపారస్తుల సామాగ్రి తొలగింపు ● ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు తప్పవని హెచ్చరిక

భైంసా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో గల ఫుట్‌పాత్ ఆక్రమణలపై పోలీసు శాఖ కొరడా ఝులిపించింది. శుక్రవారం టౌన్ సీఐ గోపీనాథ్, ఎస్ఐ గణేష్‌ల నేతృత్వంలో పోలీసు సిబ్బంది ఆక్రమణ తొలగింపులకు చర్యలు చేపట్టారు. ఉదయం ప్రారంభమైన తొలగింపుల పర్వం సాయంత్రం వరకు కొనసాగింది. ఉదయం వేళలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి రెండు గంటల గడువు ఇచ్చి తమ తమ వ్యాపార సామాగ్రి తొలగించుకోవాలని ఆదేశించారు. ఇదే క్రమంలో పలువురు వ్యాపారులు తమ దుకాణాల ముందు బాగంలోని ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన విక్రయ సామాగ్రిని సైతం తొలగించుకోవాలని సూచించారు. అయితే ఆక్రమణదారులెవరు సరియైన రీతిలో స్పందించకపోవడంతో టౌన్ సీఐ గోపీనాథ్, ఎస్ఐ గణేష్‌ల నేతృత్వంలో పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి ఆక్రమణల తొలగింపులు చేపట్టారు. ఇందుకు మున్సిపల్ సిబ్బందిని సైతం వినియోగించుకున్నారు. పంజేషా చౌక్ నుంచి మున్సిపల్ రోడ్డు మీదుగా గాంధీ గంజ్ ప్రవేశ మార్గం వరకు ఆక్రమణల తొలగింపులు నిర్వహించారు. పోలీసుల చర్యలతో ఖంగుతిన్న పలువురు ఆక్రమణదారులు అప్పటికప్పుడు వాహనాలను తీసుకవచ్చి ఫుట్‌పాత్‌లపై పెట్టిన సామాగ్రి తొలగింపులు చేపట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించుకపోయారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ గోపీనాథ్ మాట్లాడుతూ ఫుట్‌పాత్ అక్రమణలతో పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పెరిగి పోతున్నాయన్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని వివరించారు. పట్టణ పరిధిలో అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్ అక్రమణల తొలగింపులు చేపడుతామని వివరించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం అందరూ పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అక్రమణదారుడితో మాట్లాడుతున్న టౌన్ సీఐ గోపీనాథ్

కేసీఆర్‌పై నమ్మకంతోనే పార్టీలో చేరికలు

బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్



బీఆర్ఎస్‌లో చేర్చుకుంటున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ నాయకత్వం సమర్థతపై నమ్మకంతోనే పలు పార్టీల నుండి బీఆర్ఎస్‌లోకి నాయకులు చేరుతున్నారని ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్‌లోని ఆయనక్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాన్సన్ మాట్లాడారు. ఈ సందర్భంగా కడెం మండలం ఉడుంపూర్, నర్సాపూర్ గ్రామాల నుంచి బీజేపీ నాయకులు సహా పలువురు యువకులు జాన్సన్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు జాన్సన్ గులాబీ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యంతో తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పట్టిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీ లేదని ప్రజలు గ్రహించారన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపే ఏకైక నాయకుడు కేసీఆర్ మాత్రమేనని ప్రజలు నమ్ముతున్నారని ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రంలో బీఆర్ఎస్ తుఫాను వేగంతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులకు కార్యకర్తలందరికీ ఘన స్వాగతం పలుకుతున్నట్లు ప్రకటించిన జాన్సన్ ఎల్కతుర్తి సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్, కడెం మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

కడెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉడుంపూర్, నర్సాపూర్ గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, 100 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీ తుఫాన్ వేగంతో అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ ప్రజలకు ఎల్లప్పుడూ గులాబీ జెండా అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణకు చేసింది శూన్యమని, గత పదేళ్ల పాలనలో తెలంగాణ సాధనకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. 25 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ తరుణంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులందరికీ స్వాగతం తెలుపుతూ బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని వరంగల్‌లో జరిగే 25 వసంతాల రజతోత్సవ మహాసభకు కార్యకర్తలంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా జన సమీకరణ

భైంసా, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న పార్టీ రజతోత్సవ సభకు ముథోల్ నియోజక వర్గ పరిధి నుంచి భారీగా జన సమీకరణ చేపట్టినట్లుగా బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్ వెల్లడించారు. శుక్రవారం భైంసాలో కుభీర్ మండల పార్టీ ప్రధాన ప్రతినిధులతో జన సమీకరణ, తరలింపు, వాహనాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికార కాంగ్రెస్ సర్కార్ అనతి కాలంలో ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. హమీల అమలులో వైఫల్యం చెందిందన్నారు. పాలన వైఫల్యాల మూలంగా అభివృద్ధి పనులు నిలిచిపోగా సమస్యలు పేరుకపోతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుతో విసిగెత్తిపోయిన అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం బీఆర్ఎస్ వైపు దృష్టి సారించారి పేర్కొన్నారు. ఎక్కడకు వెళ్లిన కారు రావాలే, కేసీఆర్ సార్ కావాలే అని మాటలే వినిపిస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ సభలో పాల్గొనేందుకు అన్ని వర్గాల ప్రజానీకం ఉవ్విళ్లురూతోందన్నారు.దీంతో సభకు అధిక సంఖ్యలో తరలేందుకు జనాలు స్వచ్ఛందంగా సిద్దమయ్యారని వివరించారు. పార్టీ శ్రేణులు తమతమ ప్రాంతాల నుంచి జనాలను తరలింపుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇదే సందర్భంగాలో గ్రామగ్రామాన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ వారందరి మద్దతు కూడగట్టుకునే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసంగాను సమయాత్తం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో కుబీర్ మండల పార్టీ ప్రతినిధులు ఎన్నిల అనిల్ కుమార్,పీఏసీఎస్ వైస్ ఛైర్మెన్ మెంచు రమేష్, మాజీ వైస్ ఎంపీపీ మోయినోద్దీన్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవిదాస్ , నియోజక వర్గ ప్రతినిధులు రవి కుమార్, పెంటవార్ దశరథ్‌తో పాపాటు ఆయా గ్రామాల ప్రతినిదులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడి మృతి

మావల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నల్ల రాజేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాదులో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన గతంలో పలు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయన భార్య వనిత మావల జడ్పీటీసీగా పనిచేశారు. నల్లా రాజేశ్వర్ అంతిమయాత్రలో మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ జడ్పీ ఛైర్మన్ రాథోడ్ జనార్దన్ పాడేను మోసారు. అంతకు ముందు నల్ల రాజేశ్వర్ పార్థీవదేహంపై బీఆర్ఎస్ పార్టీ కండువాను కప్పి నినాదాలతో హోరెత్తించారు. నల్ల రాజేశ్వర్ మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. అంతిమ యాత్రలో డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజరెడ్డి, మాజీ మార్కెట్ ఛైర్మన్ మెట్టు ప్రహ్లాద్, వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మావల గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

భూ భారతితో రైతులకు న్యాయం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం వలన రైతులకు న్యాయం జరుగుతుందని మండల తహసీల్దార్ సోమ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గొల్లమాడ గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు తహసీల్దార్ సోమ శ్రీనివాస్ పాల్గొని భూ భారతి చట్టంపై రైతులకు, ప్రజలకు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమలత, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పరిమితికి మించి

ప్రయాణికులను తీసుకువెళ్తున్న వాహనాలు సీజ్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ ఆధ్వ ర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమం లో సరుకు రవాణా వాహనాలలో ప్రజ లని పరిమితికి మించి తీసుకు వెళ్తున్న 3 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఏఎంవీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వాహనా లలో ప్రయాణిస్తున్న ప్రజలకి అవ గాహన కల్పించారు. అనంతరం ఉప రవాణా కమిషనర్ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ వాహన యజమానులు సరుకు రవాణా వాహనాలలో ప్రజలకు తరలించినట్లయితే ఆ వాహనాలను చట్ట రీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాహన యజ మానులకు డ్రైవర్లు కూడా ప్రజల రవాణా చేయమని చెప్పాలని కోరారు. ఇందులో అధికారులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివిధ వార్డుల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. మురికి కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని తొలగించే పనులను పంచాయతీ కార్మికులు చేపట్టారు. ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్ రావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడారు.

బాసర వేద పండితుడికి అరుదైన గౌరవం

● కాబోయే పీఠాధిపతిగా ప్రకటించిన కంచి కామకోటి పీఠం



బాసర వేద పండితుడిగా పనిచేస్తున్న గణేష్ శర్మ



JAGADGURU SRI SANKARACHARYA SWAMIGAL

Srimatam Samsthanam

Announcement

Akshaya Tritiya - Wednesday, 30th April 2025

కంచి కామకోటి పీఠాధిపతిగా ప్రకటిస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు

బాసర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ దేవస్థానంలో వేదపండితుడిగా పనిచేస్తున్న ఎస్వీఎస్ఎస్ గణేష్‌శర్మకు అరుదైర గౌరవం దక్కింది. ప్రముఖపీఠం కంచి కామకోటి సర్వజ్ఞ పీఠంలో ఉత్తరాధికారిగా నియామితులు కానున్నారు. ఈ మేరకు కంచిపీఠం నుంచి శుక్రవారం ఒక ఉత్తర్వులు గణేష్ శర్మ అందుకున్నారు. కంచి కామకోటి పీఠానికి 71వ పీఠాధిపతిగా గణేష్‌శర్మ కొనసాగనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నవరంనకు చెందిన దుడ్డు ధన్వంతరి దేవి కుమారుడైన గణేష్ శర్మ రుగ్వేదాన్ని అభ్యసించారు. గత రెండు సంవత్సరాలుగా బాసర సరస్వతీ అమ్మవారి చెంద వేదపండితునిగా సేవలు అందిస్తున్న గణేష్ శర్మకు వేద శాస్త్రంలో ఉన్న ప్రావీణ్యం గుర్తించిన కంచి పీఠం ఈ అవకాశం కల్పించింది. ఈ విషయం తెలియగానే బాసర సరస్వతీ దేవస్థాన వైధిక సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అక్షయ తృతీయ పర్వదినాన గణేష్ శర్మ పీఠాధిపతిగా నియమితులు కానున్నారు.

ఒప్పంద అధ్యాపకుల మానవహారం

● బాసర ఆర్జీయూకేటీలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె

బాసర, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో పనిచేసే ఒప్పంద అధ్యాపకుల నిరవధిక సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరింది.నిరవధిక సమ్మెలో భాగంగా బాసర రైల్వే స్టేషన్ వద్ద గల చత్రపతి శివాజీ విగ్రహం ముందు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నినాదాలతో ఆందోళన చేశారు.ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ2008 సంవత్సరంలో ప్రారంభమైన ట్రిపుల్ ఐటీ మొదటి నుంచి కొనసాగుతున్నామని అన్నారు. 17 సంవత్సరాల తమ సేవలను గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చేప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం, శ్రీకాంత్, శ్రీరామ్, శేఖర్, రజిత, భానుప్రియ, ప్రశాంతి, ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా ఏర్పాడి నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు



ఆదిలాబాద్ లోని బోథ్ గురుకుల డిగ్రీ కళాశాల ఇది..



డిగ్రీ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో రాణించిన విద్యార్థులు



గురుకుల డిగ్రీ కాళాశాల పుస్తకమేళాలో పాల్గొన్న విద్యార్థులు..

ఈ గురుకులం.. విద్యార్థులకు వరం

● బోథ్ డిగ్రీ గురుకులంలో నాణ్యమైన విద్య
● డిగ్రీ కళాశాలలో సీట్లకు ఫుల్ డిమాండ్
● క్రీడల్లో, ఉద్యోగాల్లో సత్తా చాటుతున్న విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గురు కులాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బోథ్ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసి డెన్షియల్ డిగ్రీ కళాశాల నాణ్యమైన విద్యనందిస్తూ సత్ఫలితాలనిస్తున్నది. ఉన్నత లక్ష్యాలు ఏర్పాటు చేసుకున్న విద్యార్థులకు ఈ గురుకులం వరంలా మారింది. ఈ గురుకులంలో చదివిన చాలా మంది విద్యార్థులు జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీజీ సీట్లు సాధిం చడంతో పాటు, వివిధ రంగాల్లో ఉద్యోగాలను సైతం సాధిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనంది స్తూ ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తున్న బోథ్ గురుకుల డిగ్రీ కళా శాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ఈ కళాశాలలో సీట్లకు ఫుల్ డిమాండ్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బోథ్ డిగ్రీ గురుకుల కళాశాల పేద విద్యార్థులకు వరంలా మారింది. దీంతో ప్రతి ఏడాది ఈ కళా శాలలో సీట్లకు డిమాండ్ పెరుగుతూనే ఉన్నది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం సైతం సీట్ల సంఖ్యను పెంచుతూనే ఉన్నది. 2017-18లో 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాలలో.. ఇప్పుడు 350కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఈ కళాశాలలో బీఎస్సీ బీజడ్‌సీ, ఎంపీసీఎస్, ఎంఎస్‌డీఎస్, బీఏ హెచ్‌ఈపీ, బీ.కోమ్ గ్రూప్‌లు ఉన్నాయి. ఇందులో గ్రూప్‌కు 40 సీట్లు చొప్పున 200 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కాగా కళాశాలలో చదివిన విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీల్లో రాణించడమే కాకుండా.. జాతీయ స్థాయి యూనివర్సిటీల్లో పీజీ సీట్లు సాధించి సత్తా చాటుతున్నారు. అదేవిధంగా పోలీసు శాఖ, బ్యాంకింగ్, ఇతర రంగాల్లో ఉద్యోగా లను సాధించడమే కాకుండా.. క్రీడల్లోనూ రాణిస్తూ శభాష్ అనిపించు కుంటున్నారు. వివిధ అధ్యయనాల కోసం విదేశాలకు సైతం ఈ గురుకులం నుంచి విద్యార్థులు ఎంపికై వెళ్లడం ఈ కళాశాల యొక్క గొప్పదనాన్ని తెలియజేస్తున్నది.

నాణ్యమైన బోధనతో.. మెరుగైన ఫలితాలు..

ఈ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోజు వారి తరగతులతో పాటు ప్రతి రోజు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ అంశాలపై అధ్యాపకులు బోధిస్తున్నారు. అదేవిధంగా క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ కళాశాల విద్యార్థులు ఆయా రంగాల్లో రాణిస్తూ వారి ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నారు.

ఐఐటీ, ఎన్ఐటీలో సత్తాచాటిన విద్యార్థులు..

ఈ గిరిజన డిగ్రీ కళాశాలలో చదివిన ఆరుగురు విద్యార్థులు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (ఐఐటీ)కు ఎంపికయ్యారు. మరో ఎనిమిది మంది నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)కు సెలెక్ట్ అయ్యారు. మరికొంత మంది హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సీట్లు సంపాదించి సత్తా చాటారు. ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులు సైతం చేస్తూ రాణిస్తున్నారు. మొత్తం 52 మంది విద్యార్థులు జాతీయ యూనివర్సిటీలకు ఎంపికయ్యారు. 77 మంది రాష్ట్రస్థాయి వర్సిటీలకు సెలెక్ట్ అయ్యారు. 11 మంది ఎంబీఏ అభ్యసించారు.

క్రీడలు, ఉద్యోగాల్లో సైతం రాణిస్తున్న విద్యార్థులు..

ఈ డిగ్రీ కళాశాలలో చదివిన విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటుతూ ఔరా అనిపిస్తున్నారు. 20 మందికి పైగా స్టూడెంట్స్ క్రికెట్, అథ్లెటిక్, ఫుట్‌బాల్, వాలీబాల్ తదితర క్రీడల్లో జాతీయ స్థాయిలో సైతం రాణించారు. చాలా మంది సౌత్ జోనల్ నేషనల్స్ ఆడారు. ముగ్గురు యూనివర్సిటీ గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సాధించడమే కాకుండా.. ఆర్మీ, బీఎస్ఎఫ్, పోలీస్ విభాగాల్లోనూ ఎంపికై ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆర్మీలో నలుగురు, బీఎస్ఎఫ్‌లో మరో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. సాంకేతిక రంగంలోనూ సత్తా చాటుతున్నారు. అంతేకాకుండా ఈజిప్టు దేశ విద్యా విధానంపై 45 రోజుల పాటు అధ్యాయనం చేసేందుకు ఈ కళాశాలకు చెందిన జి.సురేందర్, టేకం సాయికిరణ్ అనే విద్యార్థులు రెండున్నరేళ్ల క్రితం ఆ దేశానికి వెళ్లి వచ్చారు. వీరి పర్యటన ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించింది.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలు

- ఐఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య - 6
- డీటీసీఓఎన్ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల సంఖ్య - 6
- సెంట్రల్ యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన స్టూడెంట్స్ - 52
- రాష్ట్ర స్థాయి వర్సిటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులు - 77

ఈ కళాశాలలో చదివి.. ఉద్యోగం సాధించా

● దుర్వ మహేశ్వర్



నేను ఈ గురుకుల డిగ్రీ కళాశాలలోనే డిగ్రీ పూర్తి చేసి.. ఇటీవలే డీ ఎస్సీలో ఎస్జీటీ టీచరుగా ఉద్యోగం సాధించాను. ఈ కళాశాలలో అనుభవ జ్ఞులైన అధ్యాపకులు బోధన అందిస్తారు. మాలాంటి గిరిజన విద్యార్థులకు ఇలాంటి గురుకులాలు ఎంతగానో ఉప యోగపడు తున్నాయి. రాబోయే విద్యార్థులు కూడా గురుకులాల్లో చేరి తమ బంగారు భవి ష్యత్తుకు బాటలు వేసుకోవాలి..

ఖోఖో జాతీయస్థాయిలో ఆడాను

● జాదవ్ ప్రదీప్, డిగ్రీ విద్యార్థి..



నేను ఈ కళాశాలలో చదువుతూ ఖోఖో జాతీయస్థాయిలో వరకు.. సౌత్ జోనల్ యూనివర్సి టీస్ చెన్నై వెళ్లి ఆడాను. ఈ కళాశాలలో చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థులు ఏ క్రీడల్లో నైపుణ్యం ఉంటే ఆ క్రీడను ఆడిస్తూ వ్యాయామ ఉపాధ్యాయులు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. దీంతో మేము రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తున్నాం.

కార్పొరేట్‌కు దీటుగా బోధన అందిస్తున్నాం

● శివకృష్ణ, ప్రిన్సిపాల్..



మా కళాశాలలో ప్రతీ సబ్జెక్టుపై విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా బోధ న చేస్తున్నాం.. అలాగే క్రీడల్లో కూడా విద్యార్థులు మేటిగా నిలబడేలా శిక్షణ ఇస్తున్నాం.. కార్పొరేట్ కు దీటుగా బోధన జరుగుతుంది.. అదే వి ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.. దీంతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం.. ఇంటర్ పూర్తి చేసిన ఎస్టీ విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్‌ల కోసం ఈ నెంబర్లను 98493 90495 , 79010 97689ను సంప్రదించాలి.

సమయపాలన తూచ్

● ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో విధుల పట్ల అధికారుల నిర్లక్ష్యం ● ఉదయం 11:30 దాటిన తర్వాతనే విధులకు హాజరు

ఖానాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓవైపు ప్రజలు కోరుకున్న విధంగా పాలన అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రనకా పగలనకా శ్రమిస్తూ పాలనను గాడిలో పెడుతోంది. ప్రభుత్వం నుంచి వస్తున్న ఆదేశానుసారం జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ పథకాలను విజయవంతంగా ప్రజల వద్దకు చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ దశలో ఒక్కో శాఖపై అదనపు ఒత్తిడి పెడుతూ పని భారాన్ని పెంచుతోంది. ఇలాంటి ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ ఇవన్నీ మాకు పట్టవన్నట్లుగా కొంతమంది అధికారులు అక్కడక్కడా ఉదాసీనంగా వ్యవహరించడం మనకు కనిపిస్తోంది. ప్రభుత్వం అమలు చేసే మండల అభివృద్ధి కార్యకలాపాలన్నింటికీ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఎంపీడీవో కార్యాలయంపై కొంతమంది కార్యాలయ అధికారులే చిన్న చూపు చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విధులలో ఉండాల్సిన కార్యాలయ సిబ్బంది, అధికారులు ఆ నిబంధనలకు నీళ్లు వదిలారని చెబుతున్నారు. ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతూ టూర్లలో ఉన్నట్లు చెబుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆంధ్రజ్యోతి ఎంపీడీవో కార్యాలయాన్ని విజిట్ చేయగా.. ఉదయం 10:30 గంటల నుండి 11:20 వరకు ఎంపీడీవో సునీత, సూపరింటెండెంట్ స్వామి, ఏపీవో రమేష్, పీఆర్ ఏఈ సూర్యతేజ విధులకు హాజరు కాలేదు. కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సందీప్ ఉదయం 11:05 గంటలకు దర్జాగా కార్యాలయానికి హాజరయ్యారు. తాము ఒక్కో రోజు సాయంత్రం ఏడు గంటల వరకు విధులు నిర్వహిస్తున్నా మని ఒక్క రోజు అరగంట, గంట ఆలస్యంగా వస్తే ఏమవుతుందని సందీప్ ఎదురు ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి విజిట్ చేసిన సమయంలో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రూబా బసేరి, కుంటాల నుంచి డిప్యూ టేషన్‌పై ఖానాపూర్‌కు వచ్చి విధులు నిర్వహిస్తున్న టైపిస్టు టి.మారుతి, ఇద్దరు అటెండర్లు విధులకు హాజరయ్యారు. ఎన్ఆర్ఈజీఎస్ విభాగంలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు విధులకు హాజరయ్యారు. మండల పంచాయతీ అధికారి కార్యాలయంలో విధుల్లో ఈ పంచాయతీ డేటా ఎంట్రీ ఆపరేటర్ సాగర్ విధులలో ఉన్నారు. మండల పంచాయతీ అధికారి రత్నా కర్ రావు టూర్ వెళ్లినట్లు కార్యాలయ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లారు.

టూర్ పేరిట ఇష్టారాజ్యంగా విధులు

క్షేత్రస్థాయిలో వెళ్లి ఫీల్డ్ విజిట్ చేయాల్సిన స్థానంలో ఉన్న అధికారులు కొంతమంది కార్యాలయ రిజిస్టర్లలో టూర్‌కు వెళ్తున్నట్లు సంతకం చేసి వెళ్తుండగా మరికొంత మంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం ఆంధ్రజ్యోతి ఎంపీడీవో కార్యాలయాన్ని ఉదయం 10:46 నిమిషాలకు విజిట్ చేసిన సమయంలో కార్యాలయ రిజిస్టర్‌ను పరిశీలించగా అందులో కేవలం ఎంపీవో రత్నాకర్ రావు మాత్రమే టూర్‌కు వెళ్తుననట్లుగా సంతకం చేసి వెళ్లారు. మిగతా అధికారులు ఎవరు టూర్‌కు వెళ్లినట్లు గాని విధులకు హాజరైనట్లు గాని కార్యాలయ హాజరు రిజిస్టర్లలో ఎటువంటి సంతకాలు చేయలేదు.

వెనుకేసుకొచ్చిన ఉన్నతాధికారి

ఈ విషయమై ఖానాపూర్ ప్రత్యేక అధికారి జీవరత్నంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కార్యాలయ అధికారులు అందరినీ ఆయన వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఎంపీడీవో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన టూర్‌కు వెళ్లారని,కార్యాలయ సూపరింటెండెంట్ తన వద్దకే పని నిమిత్తం వచ్చారని, మరో జూనియర్ అసిస్టెంట్ అగరంట లేట్ పర్మిషన్ తీసుకున్నారని, ఈ జీఎస్ ఏపీవో గాని టెక్నికల్ అసిస్టెంట్లు గాని కార్యాలయంలో ఉండాల్సిన పని లేదని వారు టూర్లలో ఉంటారని తెలిపారు. ఈ టూర్లను అడ్డం పెట్టుకొని సంబంధిత శాఖ అధికారులు విధులకు ఇష్టారాజ్యంగా హాజరవు తున్నారనే ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్ చేసే విధుల్లో ఉ న్న అధికారులు ఎంపీడీవో కార్యాలయ హాజరు పట్టికలో ఎప్పుడైనా సంతకం చేయవచ్చనే వెసులుబాటు ఉందని ఉన్నతాధికారులు చెబుతుం డడంతో కొంతమంది ఫీల్డ్ విజిట్‌లో ఉన్నామని తమ సొంత పనులు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంపీడీవో సహా కార్యాలయంలోని కొంతమంది అధికారులు సిబ్బంది నిత్యం కార్యాలయానికి 11:30 దాటితే తప్పా హాజరుకారని పలువురు చెబుతున్నారు.



శుక్రవారం ఉదయం 10:46కు ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీవో కుర్చీ

టూర్ విధులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న స్థానికులు

క్షేత్రస్థాయిలో ఫీల్డ్ విజిట్ (టూర్) నిర్వహించే కొంతమంది అధికారులు ఉదయం లేచిందే మొదలు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పనలు పనులు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయోననే వివరాలను జిల్లా కలెక్టర్‌కు ఉన్నతాధికారులకు అందజేస్తున్నారు. కానీ మరికొంత మంది మాత్రం టూర్ విధులకు వెళ్లే వెసులుబాటును అడ్డం పెట్టుకొని తమ సొంత పనులకు ఆ సమయాన్ని ఉపయోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు వెలువడుతున్న నేపథ్యంలో టూర్‌కు వెళ్లే విధులలో ఉన్నతాధికారులకు పకడ్బందీ నిబంధనలను అమలు చేయాలని పలు వురు కోరుతున్నారు. సంబంధిత అధికారులు ఒక్కరోజు ముందుగానే వీరు ఫీల్డ్ విజిట్‌కి వెళ్లే వివరాలను కార్యాలయ రిజిస్టర్‌లో నమోదు చేయడం లేదా ఫీల్డ్ విజిట్‌కి వెళ్లే ముందు రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లడం లాంటి నిబంధనలను అమలు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేడు టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో బయోమెట్రిక్ హాజరు, లైవ్ లోకేషన్ లాంటి ఆధునిక వెసులుబాటులు ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. ఈ టెక్నాలజీని ఉపయోగించి సంబంధిత అధికారులు ఎక్కడ టూర్‌లో ఉన్నారో కార్యాలయ సిబ్బందికి వెంటనే తెలియజేసేలాగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి స్థానంలో ఉన్న అధికారి మండంలో ఏ గ్రామంలో పర్యటిస్తున్నారో కార్యాలయంలో లైవ్ లోకేషన్ అందుబాటులో ఉంచితే వారు కార్యాలయంలో అందుబాటులో లేని సమయంలో కార్యాలయాన్ని సందర్శించే అధికారులకైనా, ప్రజలకైనా జవాబుదారితనంగా ఉంటుందని పలువురు చెబుతున్నారు. ఒకవేళ ఇది వరకే వర్తింపజేస్తే వారు విధులకు ఆలస్యమైన ఈ సమయంలో ఎక్కడ విధులు నిర్వహిస్తు న్నారో లైవ్ లోకేషన్‌ను పరిశీలించాలని విధులలో లేని వారిపై చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



శుక్రవారం ఉదయం 11:18 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీవో కుర్చీ



10:52 గంటలకు ఎంపీవో, ఓ జూనియర్ అసిస్టెంట్ ఇద్దరు అటెండర్లు మినహా టూర్‌కు వెళ్లినట్లు గాని విధులకు హాజరైనట్లు గాని కనిపించని మిగతా అధికారుల సంతకాలు



శుక్రవారం ఉదయం 10:47 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ కుర్చీ

రహదారిపై పడ్డ భారీ వృక్షం

స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు

బోథ్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లి మండలంలోని పొచ్చెర రహదారిపైన శుక్రవారం రోడ్డుకు అడ్డంగా వృక్షం కూలింది. చెట్టు అడుగు భాగంలో కాలిపోవడంతో చెట్టు కాలిపోయాయి. రోడ్డుకు అడ్డంగా పడిపోయే ఆస్కారం ఉందని కొంత మంది పౌరులు సామాజిక మధ్యమాలలో పెట్టడం జరిగింది. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును జేసీబీ ద్వారా తొలగించారు. అధికారులు స్పందించకపోతే భారీ వృక్షం విద్యుత్ తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ఆస్కారం ఉందని గమనించి విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. దీంతో పలువురు ప్రజలు విద్యుత్ శాఖ అధికారుల నిర్ణయాన్ని అభినందించారు.



పొచ్చెర క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్టును తొలగిస్తున్న జేసీబీ

గుక్కెడు నీటి కోసం శునకం ఆరాటం

తాంసి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గుక్కెడు నీటి కోసం శునకం ఆరాటపడ్డ దృశ్యం అందరినీ ఆశ్చర్య పరిచింది. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద ఉంచిన నీళ్ల ట్యాంకుపైన ఎక్కి నీళ్లు తాగేందుకు ఆ శునకం విశ్వ ప్రయత్నం చేసింది. కానీ ఆ నీటి ట్యాంకులో చుక్క నీరు కనిపించలేదు. దీంతో ఆ శునకం పడిన ఆరాటం అంతా ఇంత కాదు. మండుతున్న ఎండలు ఒక పక్క తాగు నీటి జలాలు అడుగంటడం మరో పక్క నీటి కటకట ఏర్పడింది. దీంతో ఆ శునకం నీటి కోసం ఆ రాటపడుతున్న దృశ్యాన్ని తిలకించిన జ నం ఎట్టకేలకు నీటిని అందించారు. దీంతో ఆ శునకం దాహాన్ని తీర్చుకుని వెళ్లిపోయింది.



తాగునీటి కోసం అల్లాడుతున్న శునకం

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

కుభీర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుభీర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జావిద్‌కాన్ ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాన్‌లో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా క్యాండిల్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గావ్‌లో ఉగ్రవాదు లు దాడి చేసి 26 మందిని హతమార్చి మారణహోమం సృష్టించారిని ప్రభుత్వం వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. మరణించిన వారి ఆత్మహత్యకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

మీ శ్రేయస్సు కోరే వారికి అందించండి...

ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

మీ ఆత్మీయులలో.. మీ సహోద్యోగులలో... మీ కుటుంబ సభ్యులలో...

ఎవరైనా రిటైర్ అవుతున్నారా ?

అలాంటి వారు తమ విధి నిర్వహణలోని అనుభవాలు, సలహాలు, సూచనలు ఇచ్చి మీ అభివృద్ధికి మార్గదర్శకులై ఉంటారు. అయితే వారికి తీపి గుర్తుగా, మీ అమూల్యమైన కానుకగా శుభాభినందనలు తెలుపాలనుకుంటున్నారా ! అయితే ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనతో వారి ఆనందాన్ని మరింత రెట్టింపు చెయ్యండి.

అందుకు మా ప్రకటనల ప్రతినిధి మీ అందుబాటులోనే ఉన్నారు.



ఆంధ్రజ్యోతి

25%

ఆదిలాబాద్

9985411291

నిర్మల్ : 8096677672

9985411453

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

● ఉద్యమ నేత డాక్టర్ సుభాష్ రావు

నిర్మల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ నియోజకవర్గంలో స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీలో ఒక్కసారిగా ఊపు తెచ్చేందుకు నాటి ఉద్యమ నేత డాక్టర్ యూ. సుభాష్‌రావు తనవంతుగా కృషి చేస్తున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ వేడుక లను విజయవంతం చేయాలంటూ నిర్మల్ సెగ్మెంట్ అంతటా చుట్టేస్తూ నాటి ఉద్యమకారులను తిరిగి తట్టి లేపుతున్నారు. ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్క తుర్తిలో నిర్వహించనున్న ఆ పార్టీ రజతోత్సవ వేడుకలకు పార్టీ శ్రేణులను భారీగా తరలించేందుకు సుభాష్‌రావు తన వంతుగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో వారం రోజులుగా ముమ్మర పర్యటనలు చేస్తూ గోడ రాతలు, ఫ్లెక్సీల ఏర్పాటుతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపుతున్నారు.



రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతున్న డాక్టర్ సుభాష్

బహిరంగ ప్రకటన

ICICI Bank

సమోదిత కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ టవర్, చకి సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర-390007.
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా - కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన


ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలు విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో మే 06, 2025న, తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగింపు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైటుకు లాగిన్ అవ్వండి. రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: ఆసిఫాబాద్	
230762000365	[illegible]
శాఖ పేరు: బోథ్	
376962006971	[illegible]
శాఖ పేరు: ధారూర్	
220362001100	అనుగంటి రాజిరెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్- ప్రగతి నగర్ II	
457262000023	ఎం [illegible]
శాఖ పేరు: హైదరాబాద్- డా.ఎ.ఎస్.రావు నగర్	
024457000073	జాలిల్లి శివనాగేశ్వరరావు
శాఖ పేరు: హైదరాబాద్- ఈస్ట్ మారేడ్‌పల్లి	
111862001708	విశ్వనాథుల శేఖర్
శాఖ పేరు: హైదరాబాద్- కాటేదాన్	
333357000018	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- కాపూరి హిల్స్	
112062003494	[illegible]
శాఖ పేరు: హైదరాబాద్- కూకట్‌పల్లి	
631262037408	కార్తికేయ కుమార్ కె
శాఖ పేరు: జగిత్యాల	
280862001573	పోతరాజు రాజలింగం
280862004574	ఎం గంగాధర్
శాఖ పేరు: కోదాడ- తెలంగాణ	
363362004864	నాగమణి పింగళి
శాఖ పేరు: కొల్లంపల్లి	
222062001043	[illegible]
222062001191	సీతారాం నాయక్
శాఖ పేరు: కూకట్‌పల్లి- వివేకానందనగర్	
180662003525	జె దుర్గారావు
180662003534	జె దుర్గారావు
శాఖ పేరు: లింగంపల్లి	
762162000418	[illegible]
శాఖ పేరు: మహబూబాబాద్	
750162003964	నాగుర్ల అరుణ
శాఖ పేరు: మేడ్చల్	
279862001627	[illegible]
శాఖ పేరు: నిర్మల్	
153362013327	గణపతి విక్రమ్ రాజు
153362014236	[illegible]
153362014244	[illegible]
153362014303	[illegible]
153362014538	[illegible]
శాఖ పేరు: సిద్దిపేట	
069157000082	చిప్పడు నర్సింలు
శాఖ పేరు: [illegible]	
221262001232	[illegible]
శాఖ పేరు: [illegible]	
222562000188	ముదావత్ శాంతమ్మ
శాఖ పేరు: వికారాబాద్	
395862001970	వాంకోవత్ బాబూరావు
395862002397	ఎండి మహమూద్ పాషా
395862002900	ఎండి మహమూద్ పాషా

తేది: 26.04.2025

ప్రదేశం: మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, మహబూబాబాద్, నిర్మల్, కొమురం భీమ్(ఆసిఫాబాద్), మెదక్, సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాల, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నారాయణపేట్, సూర్యపేట్, వికారాబాద్

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున





● సాత్నాల ప్రాజెక్టు ఇరిగేషన్ గోదాంలో ఏర్పాటు చేసిన సాత్నాల మండల పరిషత్ కార్యాలయం ←

● ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేసిన సోనాల తహసీల్దార్ కార్యాలయం →



అంతా ఆగమాగం..

- జిల్లాలోని కొత్త మండలాల్లో ఇంకా పాత సమస్యలే..
- కార్యాలయాలు కరువు.. అధికారులు ఉండరు
- తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్న కార్యాలయాలు
- అధికారుల హడావుడి.. గాడిలో పడని పాలన
- సమస్యలతో సతమతమవుతున్న స్థానిక ప్రజలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాలనా సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసినప్పటికీ.. దాననుగుణంగా ప్రభుత్వం వసతులను కల్పించక పోవడంతో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. పాలన అందుబాటులోకి వచ్చిన ఎన్నో రకాల ఇబ్బందులతో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సోనాల మండలం తప్ప ఇతర మండలాల ఏర్పాటుకు పెద్దగా డిమాండ్లు లేకపోయినా.. అధికార పార్టీ నేతల సిఫారసులతో హడావుడిగా.. ఆదరబాదరగా ప్రభుత్వం కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. కొత్త మండలాల్లో పరిస్థితి ఇంకా ఆగమాగంగానే కనిపిస్తోంది. అందుబాటులో ఉన్న భవనాల్లో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ కొన్ని శాఖలకు అద్దె భవనాలు కూడా అందుబాటులో లేకపోవడంతో పాత మండలాల నుంచే ఇంకా పాలన కొనసాగుతోంది. అధికారులు అందుబాటులో లేక రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత 9 ఏళ్ల క్రితం జిల్లాలో గాదిగూడ, సిరికొండ, మావల, భీంపూర్, ఆదిలాబాద్ అర్బన్ ఐదు కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. ఇటీవల బోథ్ మండలంలో సోనాల, జైనథ్ మండలంలో బోరజ్, సాత్నాల కొత్తగా మూడు మండలాలు ఏర్పడ్డాయి. అయినా కొత్త మండలాల్లో ఇంకా పాత సమస్యలే కనిపిస్తున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన మండలాలకే పూర్తి స్థాయిలో వసతులను కల్పించ లేదు. అలాగే ఏఒక్క కార్యాలయానికి సొంత భవనాలను నిర్మించ లేదు. మళ్లీ ప్రభుత్వం మరో మూడు కొత్త మండలాలను ఏర్పాటు చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వానికి తామేమీ తక్కువ కాదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో మూడు కొత్త మండలాలను ఏర్పాటు చేసి పాలనను గాలికి వదిలేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విధులపై ఆసక్తి చూపని అధికారులు

కొత్త మండలాలను ఏర్పాటు చేసినా.. దాననుగుణంగా అధికారుల నియామకాన్ని చేపట్టక పోవడంతో ఒక్కో అధికారికి రెండు మూడు శాఖల బాధ్యతలను అప్పగిస్తున్నారు. దీంతో కొత్త మండలాల్లో విధులు నిర్వహించేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదంటున్నారు. కొందరికి ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించిన తప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. మండలం కొత్తదైనా పాత మండల అధికారులే ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేవన్న కారణంగా అధికారులు ఎవరూ కూడా విధులు నిర్వహించేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అంతేకాకుండా బదిలీపై కొత్త మండలానికి వెళ్లాల్సి వచ్చినా.. దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లి వెంటనే ఇతర మండలాలకు బదిలీ చేయించుకుంటున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో పాత మండలానికి వెళ్తే తమకేమీ తెలియదంటూ అక్కడి అధికారులు సమాధానమిస్తున్నారు. ఇన్‌చార్జీ అధికారులు పాత మండలాల నుంచి కదలక పోవడంతో అక్కడికే వెళ్లి పనులు పూర్తి చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం నలుగురైదుగురు అధికారులు తప్ప కొత్త మండలాల్లో కొనసాగుతున్న వారంతా ఇన్‌చార్జీ అధికారులేనని తెలుస్తుంది.

సమస్యలతో నెట్టుకొస్తున్న పాలన

కొత్త మండలాల్లో అరకొర వసతుల నడుమనే ప్రభుత్వ పాలన కొనసాగుతుంది. ఇప్పటికి ఎక్కడ పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల కనీసం మరుగుదొడ్లు కూడా అందుబాటులో లేకపోవడంతో అధికారులతో పాటు కార్యాలయాలకు వచ్చిపోయే వారంతా చెప్పుకోలేని ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ఇప్పటికీ తాత్కాలికంగా రేకుల షెడ్లలోనే ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో చిన్నపాటి వర్షానికి కార్యాలయాలను మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కార్యాలయాల రికార్డులకు భద్రత కూడా లేకుండానే పోతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని మండలాల్లో అయితే ప్రభుత్వ పాఠశాలల్లోనే మండల స్థాయి కార్యాలయాలను ఏర్పాటు చేశారు. దీంతో కార్యాలయాలకు వచ్చి పోయే ప్రజల రద్దీతో పాఠశాల చదువులకు ఇబ్బందికరంగా మారిందంటున్నారు. అదేవింగా గ్రామీణ ప్రజలకు ఎంతో ముఖ్యమైన శాఖలుగా చెప్పుకునే వ్యవసాయ శాఖ, విద్యా శాఖ, పశు సంవర్ధక శాఖలకు అసలు భవనాలు కనిపించడం లేదు. దీంతో అధికారులను కలిసేందుకు ప్రజలు పాత మండలాలకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అత్యవసర సమయంలో అధికారులకు ఫోన్ చేసినా.. స్పందించడం లేదంటున్నారు. ఇలా ఎన్నో సమస్యలతో కొత్త మండలాల పాలనను నెట్టుకొస్తున్నారు.

పేరుకే కొత్త మండలం.. అభివృద్ధి శూన్యం

: తుల హరీష్ కుమార్, యువజన సంఘం అధ్యక్షుడు, సోనాల



బోథ్ మండలంలోని సోనాల గ్రామాన్ని కొత్త మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. కానీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు లేక తాత్కాలిక భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అరకొర సౌకర్యాలతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు, విద్య, వ్యవసాయ కార్యాలయాలను ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. ప్రజల డిమాండ్ మేరకు ప్రభుత్వం కొత్త మండలాన్ని ఏర్పాటు చేసిన దాననుగుణంగా వసతులను కల్పించాల్సిన అవసరం ఉంది.



పాఠశాలను సందర్శించిన రాకెట్ సాఫ్ట్‌వేర్ సంస్థ బృందంతో పీవో

గిరిజన పాఠశాలల్లో మౌలిక వసతులకు తొలి ప్రాధాన్యం : పీవో

ఉట్నూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. ఈ సందర్భంగా వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని ప్రాథమిక పాఠశాలలో శిశు బెంచెస్ బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న రాకెట్ సాఫ్ట్‌వేర్ సంస్థ ద్వారా 6 వేల మంది విద్యార్థులకు సరిపోయే మూడువేల శిశు బెంచెస్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూపీఎస్ దేవుగూడ ప్రధానోపాధ్యాయులు మంగిలాల్‌కి సంస్థ డైరెక్టర్ శాంతి బెంచెస్ అందజేశారు. గిరిజన విద్యాభివృద్ధిలో సహకారం అందిస్తున్నటువంటి రాకెట్ సాఫ్ట్‌వేర్ డైరెక్టర్ శాంతికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభినందనలు తెలిపారు. దీంతో ఆదిలాబాద్‌లో ఐదు, ఆసిఫాబాద్ జిల్లాలో నాలలు మొత్తం తొమ్మిది పాఠశాలలకు సైన్స్ ల్యాబ్ పరికరాలు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలు ఇంద్రవెల్లిలో స్టెమ్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో జగన్, సంస్థ మేనేజర్ దీపక్, ఐటి ఇన్‌చార్జి రామారావు, ప్రధానోపాధ్యాయులు రాథోడ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రవీందర్ రాథోడ్

జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి కల్పించాలి : డీఆర్‌డీవో పీడీ

తలమడుగు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ రవీందర్ రాథోడ్ కోరారు. మండలంలోని కప్పరిదేవి, జరీ, డోర్లీ, తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పీడీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో గ్రామీణ కూలీలకు పని కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రతీ కూలీకి ప్రతీరోజు రూ. 300 కూలి కల్పించే విధంగా పనులు కల్పించాలన్నారు. అదేవిధంగా పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతీ వారం కూలీలకు డబ్బులు అందేవిధంగా చూడాలన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా కూలీలే పర్యవేక్షించాలని సూచించారు. మండలంలో పది వేల మందికి జాబ్ కార్డులు ఉండగా.. మూడు వేల మంది వస్తున్నారని, ఇంకా కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ఆ తర్వాత మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న వాటర్ షెడ్ పనుల వివరాలను పీడీ అడిగి తెలుసుకున్నారు. దీనిలో భాగంగా ఝరి గ్రామ సమీపంలో జరుగుతున్న వాటర్ షెడ్ చెక్ డ్యాం పరిశీలించారు. అంతేకాకుండా పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఇందులో ఈజీఎస్ ఏపీవో మేఘమాల, ఈసీ ప్రవీణ్ రావ్, వాటర్ షెడ్ టెక్నికల్ అధికారి మల్లేశ్వర్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్న మహిళలు

తాగునీరు లేక గ్రామస్థుల ఇక్కట్లు

నేరడిగొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తాగునీరు లేక గ్రామస్థులు పడుతున్నారు. మండలంలోని మంగల్ మోట గ్రామంలో గత నెల రోజులుగా తాగునీరు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు గత నెలలో రోజులుగా రాకపోవడంతో, గ్రామంలో ఉన్న బోరు బావిలను బాగు చేయాలని గ్రామస్థులు పంచాయితీ కార్యదర్శికి సమస్యను విన్నవించారు. అయినప్పటికీ గ్రామ పంచాయితీ అధికారులు, సిబ్బంది రాకపోవడంతో గ్రామంలో కనీసం తాగడానికి కూడా నీళ్లు లేవని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నార్నూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉన్న దళిత రైతుల సమస్యలను పరిష్కారం చేయాలంటూ దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కోరారు. భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సులో భాగంగా శుక్రవారం నార్నూర్ మండలానికి వచ్చిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, దళిత సంఘాలు పక్షాన అవగాహన సదస్సులో నర్సింగ్ మొరే కోరారు. సంబంధిత అంశాలు ప్రభుత్వం పరిశీలన దృష్టిలో ఉన్నాయని కలెక్టర్ అన్నారు. వారి వెంట దళిత నాయకులు, తదితరులు ఉన్నారు.



నీరు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

కరెంటు సమస్య తీర్చి.. నీరందించి!

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

బేల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకోరి గ్రామంలో ఓ రైతుకు సంబంధించిన మొక్కజొన్న పంట కరెంటు సమస్య కారణంగా నీరందించలేక కొంతమేర ఎండిపోయింది. కాగా ఎండిపోయిన మొక్కజొన్న పంట గురించి రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్న క్రమంలో.. 'కరెంటు కోత.. రైతు గోస' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలోని పంట చేను వద్దకు వెళ్లి.. పాడైన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించారు. అంతేకాకుండా నీరు అందే విధంగా చేశారు. దీంతో స్థానిక రైతులు మిగతా పంట ఎండిపోకుండా నీరు అందుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.

గాదిగూడ, నార్నూర్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● గాదిగూడలో భూభారతి ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు ● పాల్గొన్న జిల్లా, మండల స్థాయి అధికారులు

నార్నూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గాదిగూడ నార్నూర్ మండలాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మండలాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుంది. జిల్లాలోని మారుమూల ప్రాంతమైన గాదిగూడలో భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. శుక్రవారం భూ భారతి అవగాహన సదస్సు లో జిల్లా కలెక్టర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సబ్ కలెక్టర్ యువరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారుతితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రైతులు ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా భూ భారతి అవగాహన సదస్సు కార్యక్రమంలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై తహసీల్దార్ గ్రామస్తులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పలువురు రైతులు భూ భారతి చట్టంపై సందేహాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ వారి సందేహాలను నివృత్తి చేశారు. అంతేకాకుండా భూ భారతి' నూతన ఆర్ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూములపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూ భారతి చట్టంపై అవగాహనను కల్పించుకొని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సదస్సులో తహసీల్దార్ విజయనందం ఎంపీడీవో, ఎంపీవో, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



గాదిగూడలో భూ భారతి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

● నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

నేరడిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ బదలుగా కొత్త భూ భారతి ఆర్‌వోఆర్ యాక్ట్ 2025 భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం రైతు మేలు కోసం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఖలీం అన్నారు. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో గల సూర్య గార్డెన్‌లో రైతు అవగాహన సదస్సులో కొత్త ఆర్‌వోఆర్ చట్టం గురించి తెలుసుకోవాలని, ముఖ్యంగా ధరణిలో సమస్యలు పరిష్కారం కాని రైతులు భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే భూ సమస్యలు ఏవైనా ఉంటే రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించబడుతుందని తహసీల్దార్ ఖలీం అన్నారు.

సుర్రుమంటున్న సూర్యుడు!

● అత్యధికంగా బేలలో 45.2 డిగ్రీలు నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలతో పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి పోతున్నాయి. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 44.6 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 30.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతల మాదిరిగానే కనిష్ఠ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి పోతున్నాయి. దీంతో రాత్రి పగలు అనే తేడా లేకుండా తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అలాగే అత్యధికంగా బేల మండలంలో 45.2 డిగ్రీలు, తలమడుగు మండలంలో 45.1, ఆదిలాబాద్‌రూరల్‌లో 45.0, ఆదిలాబాద్‌అర్బన్‌లో 44.9, సిరికొండలో 44.8, నార్నూర్‌లో 44.7, తాంసిలో 44.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా దాదాపుగా జిల్లావ్యాప్తంగా 42 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పెళ్లిలు, ముహూర్తాల సీజన్ కావడంతో ఎండల తీవ్రతతో ఫంక్షన్ల పై ప్రభావం పడుతుంది. ఎండల తీవ్రతకు బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. కొందరైతే పెళ్లి ముహూర్తాలను వాయిదా వేసుకుంటున్నారు. ఎండలు కొంత తగ్గుముఖం పట్టిన తర్వాత ఫంక్షన్లు నిర్వహించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.



జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల వెల్లువ



● ఉట్నూర్ మండలంలో రాజీవ్ యువ వికాసం కోసం వచ్చిన దరఖాస్తులు

ఉట్నూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యువతకు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి కలిగించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వేలల్లో వచ్చాయి. జిల్లాలోని 21 మండలాల్లో ఎస్సీల నుంచి 17వేల దరఖాస్తులు రాగా.. ఎస్టీల నుంచి 21వేల దరఖాస్తులు, బీసీలు, ఎంబీసీలు, బీసీ ఫెడరేషన్ల నుంచి 33వేల దరఖాస్తులు, ఈబీసీల నుంచి 880, మైనార్టీల నుంచి 9000, క్రిస్టియన్ మైనార్టీల నుంచి 75 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది. ఇందులో ఆన్‌లైన్ 48,732 మంది నుంచి రాగా వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకున్న వారు 35,280 మంది ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆయా మండల అభివృద్ధి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపిన అనంతరం రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారులను ఎంపికచేస్తున్నట్లు తెలుస్తుంది.

● కార్యదర్శులపై ఆర్థిక భారం

ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువవికాసం దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరపనున్న పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడనుంది. జిల్లా అధికారుల సూచనల మేరకు ప్రతీ లబ్ధిదారుడికి రెండు పేజీలపై క్షేత్ర స్థాయిలో కార్యదర్శి విచారణ జరపాల్సి ఉంది. దీనికి కావాల్సిన కాగితాలను జిల్లా అధికారులు సరఫరా చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తమ సొంత ఖర్చుల ద్వారా ఈ కాగితాలను తయారు చేసుకుని క్షేత్రస్థాయికి వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికే పంచాయతీలలో నిధులు లేక అన్ని పనులు తమ ద్వారానే చేయాల్సి వస్తున్నందున ఆర్థిక భారం పడుతుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి సమాచారం అందించి పంచాయతీలకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నాగపూర్‌లో ఇందిరమ్మ లబ్దిదారుల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో

ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో దళారీలను నమ్మవద్దు : ఎంపీడీవో

బోథ్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మధ్య దళారీల నమ్మవద్దని ఎంపీడీవో రమేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని దన్నూర్ బిర్లా గొంది నాగపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులచే ప్రాథమికంగా ఎంపిక చేసిన ఇందిరమ్మ ఆర్థిక స్థితిగతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అక్రమాలకు తావు లేదన్నారు. నమ్మకూడదని ఏవైనా అనుమానాలు ఉంటే అధికారులను అడిగి తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు శిరీష, నిరోష, లక్ష్మీనారాయణ ఆయా గ్రామాల ఇండ్ల కమిటీ సభ్యులు ఉన్నారు.

● అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు : ఎంపీడీవో

నేరడిగొండ: అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లం గ్రామంలో ఇందిరమ్మ లబ్దిదారుల ఇండ్లను పరిశీలించారు. త్వరలోనే నిర్మాణం పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, లబ్దిదారులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

తాంసి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జామిడి గ్రామంలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన ఈ భవనాన్ని ప్రారంభించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ముందుగా చిన్నారులతో కరచలనం చేశారు. చిన్నారులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన భవనానికి రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ఆయన ప్రారంభించారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్